


19వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 29 మే 2025 పేజీలు : 8

## క్యాన్సర్ గుర్తింపుతో నివారణ సాధ్యం

**◆జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 28 :** క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నివారించడం సాధ్యమవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఓల్డ్ హై స్కూల్ నందు ఐఎంఎ జగిత్యాల కిమ్స్ ఆస్పత్రి సికింద్రాబాద్ మరియు కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ , హైదరాబాద్ వారు సంయుక్తంగా నిర్వహించిన క్యాన్సర్ ఉచిత పరీక్షల శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి పరీక్షలను నిర్వహించుకోవడం ద్వారా నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కిమ్స్ సికింద్రాబాద్ వైద్యుల సహకారంతో జగిత్యాల పట్టణ ప్రజల కొరకు ఉచిత నిర్ధారణ శిబిరం నిర్వహించడం దాదాపు రూ.18600 విలువగల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో చెస్ట్ ఎక్స్రే అల్ట్రా సౌండ్, మామోగ్రామ్ పాప్ సిమయర్, ఇతర క్యాన్సర్ నిర్ధారణ రక్త పరీక్షలను 489 మంది పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, ఐఎంఏ అధ్యక్షులు డా. గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్ డా.మోహన్ రెడ్డి, డా.వజ్రాలగంగాధర్, డా.మధు, డా.శ్రవణ్, మాజీ అధ్యక్షులు డా.సురేష్,మాజీ కౌన్సిలర్ చుక్క నవీన్,మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి,డా బాను,వైద్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### పశువుల అక్రమ రవాణాను

## నియంత్రించేందుకు చెక్ పోస్టుల ఏర్పాటు

**◆జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 28 :** పశువుల అక్రమ రవాణాను నిరోధించడానికి  జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి నిరంతరగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ చెక్‌పోస్టులలో 24 గంటలూ నిరంతర నిఘాలో ఉంటాయనీ, పోలీసు శాఖ మరియు పశుసంవర్ధక శాఖ సిబ్బంది షిఫ్టుల వారీగా సమన్వయంతో పనిచేస్తారని ఎస్పీ వివరించారు. పశువుల రవాణా అనేది నియమ నిబంధనల ప్రకారమే జరగాలని, అనుమతి పత్రాలు లేకుండా ఆవులు, దూడలను రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పశు వులను రవాణా చేసే ప్రతి వాహనంతో చెల్లుబాటు అయ్యే పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఎవ్వరు తమ ఆధారాలు లేకుండా రవాణాలో పాల్గొనరాదని సూచించారు. ఏ వ్యక్తి లేదా సంస్థ స్వయంగా వాహనాలను ఆపకూడదని, ఈ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అనుమానాస్పద రవాణా గమనించిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియాలో ద్వేషపూరిత, రెచ్చగొట్టే, అసభ్యకరమైన పోస్టులు పెడితే, వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

### ఆరోగ్య ఉప కేంద్రాలకు

## మరిన్ని విధులు కేటాయించాలి

**◆కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**



**చురకలు విలేకరి, ఇబ్రహీం పట్నం, మే 28 :** తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం ఇబ్రహీపట్నం మండలంలోని వర్షకొండ, తిమ్మాపూర్ గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో విద్యా, వైద్యానికి పెద్దపీట వేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా శ్రద్ధ చూపాలన్నారు. మహిళలకు ప్రతి మంగళవారం ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు రూ.20 లక్షల నిధులు సరిపోవడం లేదని, ప్రభుత్వం స్పందించి మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య అధికారి డా.ప్రమోద్ కుమార్, డిప్యూటి డిఎంహెచ్వ డా.శ్రీనివాస్, డా.అంజిత్రెడ్డి, నాయకులు ఎల్లాల దశరథ్ రెడ్డి, మాజీ జడ్పిటిసి కంఠం భారతి రమేష్, మాజీ ఎంపిపి జాజాల భీమేశ్వరీ జగన్, మాజీ వైస్ ఎంపిపి నోముల లక్ష్మారెడ్డి, నేమురి సత్యనారాయణ, జెడి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### అత్యుత్తమ విద్యకు

## కేరాఫ్ గురుకుల విద్యాలయాలు

**◆పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** తెలంగాణలో అత్యుత్తమ విద్యకు కేరా ఫ్ అంటే గురుకులాలు అని పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం తెలంగాణ గురుకుల విద్యాలయ, సాంఘిక సంక్షేమ నివాస విద్యా సంస్థల సంఘం అవార్డు సన్మాన కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించ బడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాతెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభ సభ్యుడు  వినోద్ మరియు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ  హాజరయ్యారు.పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ  మాట్లాడుతూ: “తెలంగాణ గురుకుల విద్యాలయాలు రాష్ట్ర యువతకు అత్యుత్తమ విద్యావకాశాలు కల్పించడమే కాకుండా, మానసిక, శారీరక, సాంస్కృతిక అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి.టీజీఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ సంస్థ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు చేస్తున్న కృషి అభినందనీయం.ఈ అవార్డు కార్యక్రమం విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్ని అందించింది” అని అన్నారు.

## తెలుగు సాహిత్యానికి ఇంద్రగంటి ఎనలేని సేవలు


**-మే 29...ఇంద్రగంటి శ్రీకాంత శర్మ జయంతి**



తెలుగు సాహితీ ప్రపంచంలో సుపరిచితులైన సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ దాదాపు లేదనే చెప్పాలి. పండిత వంశంలో జన్మించి, సాహితీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, సినిమా పాటలు రాసిన కవిగా, పండితునిగా, కథా రచయితగా, పత్రికా సంపాదకునిగా, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు.తూర్పు గోదావరి జిల్లా, రామచంద్ర పురంలో శ్రీకాంత శర్మ మే 29 1944 న జన్మించారు. ఆయన తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి. తెలుగు పొట్టి కథలకు "కథానిక" అనే అద్భుతమైన పేరు సూచించి, ఆ సాహితీ ప్రక్రియకు ఒక సమున్నత స్థానాన్ని కల్పించిన హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి కావడం మూలాన, చిన్ననాటి నుండే సాహిత్య వాతావరణం లో పెరిగిన శ్రీకాంత శర్మ, విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం చేపట్టారు. తెలుగులో ఎం. ఏ. పట్టభద్రులై, తర్వాత అభ్యుదయ కవిగా శర్మ పేరొందారు.అనేక? లలిత గేయాలు కవితలు, సాహిత్య వ్యాసాలతో పాటు రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలను రచించారు. జన్మనిచ్చిన పితృ దేవుల వారసత్వాన్ని నిలబెట్టడంతో పాటు, అర్థవంతమైన రచనలెన్నో చేసి, సాహితీ ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు శ్రీకాంత శర్మ. అపురూపమైన భావావేశం సొంతం చేసుకొని, ఆవేశాన్నైనా, ఆవేదననైనా అక్షరాల్లో లయబద్ధంగా అమర్చ గలగడం, పాఠకుల మనసులతో పాటు, మెదళ్ళనీ రచనల ద్వారా కదిలించ గలగడం శ్రీకాంత శర్మ ప్రత్యేకతలు. పలు తెలుగు సినిమాల్లో ఆయన పాటలు రాశారు. 'కృష్ణావతారం', 'నెలవంక', 'రావుగోపాల రావు', 'రెండుజెళ్ల సీత', 'పుత్తడి బొమ్మ', 'చైతన్య రథం' వంటి చిత్రాల్లో శ్రీకాంత శర్మ పాటలు రాశారు. తన కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'సమ్మోహనం' సినిమాలోనూ ఆయన పాటను రాశారు. ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఉప సంపాదకులుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టినా, కొంతకాలం సినిమా రంగంలో పని చేసినా, ఆలిండియా రేడియోలో అడుగు పెట్టాకనే శ్రీకాంతశర్మ సృజనాత్మకత పూర్తిగా రెక్కలు విప్పుకుంది. ఆయన రచించిన ఎన్నో సంగీత రూపకాలు జాతీయ స్థాయిలో బహుమతులు అందు కున్నాయి. ఆయన రచించిన లలిత గీతాలు ఈనాటికీ బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. తెలుగు నాటక రంగానికీ, తెలుగు సాహిత్య రంగానికీ ఆయన చేసిన కృషి ఎన్నదగినది.1976లో ఆకాశవాణి విజయ వాడ కేంద్రంలొ అసిస్టెంట్ ఎడిటర్ గా శర్మ చేరాడు. తెలుగు ప్రసంగాల శాఖకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాసంగికులు ఉషశ్రీకి సహాయకునిగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. శర్మ వివిధ పత్రికలలో గేయాలు, కవితలు, సాహిత్య వ్యాసాలు వ్రాశారు. అనేక రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలు రచించారు. రేడియో ప్రసంగాలు చేశాడు. 1994లో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా నిజామాబాద్ కేంద్రంలో పని చేశాడు. 1995లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా చేరారు.1977లో అనుభూతి గీతాలు కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం, 1979లో నూతలపాటి సాహితీ పురస్కారం, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో అమరామరం డాక్యుమెంటరీకి ప్రథమ బహుమతి, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో వర్షానందిని సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1986లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నేనుకాని నేను సృజనాత్మక రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మాటా - మౌనం సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నిశ్శబ్దగమ్యానికి ద్వితీయ బహుమతి, 1990లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మెట్లకు ద్వితీయ బహుమతి, తదితరాలు సొంతం చేసుకున్నారు.ఆయన సతీమణి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి. నవలా రచయిత్రిగా, రేడియో కళాకారిణిగా, లఘు కథల రచయిత్రిగా, కవయిత్రిగా సుపరిచితులు. కుమార్తె కిరణ్మయి కూడా లఘు చిత్రాలు తీస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. కుమారుడు ఇంద్రకంటి మోహన కృష్ణ సినీ దర్శకునిగా మంచి గుర్తింపు పొందారు. దర్శకునిగా ఆయన తొలి చిత్రం 2004లో గ్రహణంకు భారత జాతీయ చలన చిత్ర పురస్కారం, ఉత్తమ నూతన దర్శకులుగా నంది పురస్కారంతో పాటు ఆ సినిమాకు 11 అవార్డులు దక్కడం విశేషం. 2006లో మాయాబజార్, 2008 లో అష్టా చమ్మా, 2011లో గోల్కొండ హైస్కూల్, 2013లో అంతకు ముందు ఆ తర్వాత ( ఉత్తమ కథా రచయిత గా నంది అవార్డు), 2015లో బందిపోటు, 2016లో జెంటిల్ మాన్, 2017 లో అమీతుమీ, 2018లో సమ్మోహనం, 2020లో వి. తదితర చిత్రాలలో తన ప్రతిభను చాటారు.

# వ్యవసాయం ఉద్యమంలా ముందుకు సాగాలి

**-మే 29.. చరణ్ సింగ్ వర్ధంతి సందర్భంగా**



**రామ కిష్టయ్య సంగన భట్ల...**

పరిశ్రమ కంటే వ్యవసాయం ప్రాధాన్యతను, యాంత్రిక ఉత్పత్తి కంటే ఉపాధి ప్రాధాన్యతను వాదిస్తూ, గాంధీ సూత్రాలతో భారతదేశ అభివృద్ధి కోసంచౌదరి చరణ్ సింగ్‌ను చరిత్రకారులు,ప్రజలు 'భారతదేశపు రైతుల విజేత'గా గుర్తించారు. వ్యవసాయపరంగా ఆధిపత్యం కలిగిన మీరట్ జిల్లాలోని గ్రామీణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన స్వతంత్ర భారతదేశంలో ఏకైక ప్రముఖ రైతు నాయకుడు.ఆయన ఉత్తరప్రదేశ్‌లో భూసంస్కరణల ప్రధాన రూపశిల్పి, రాష్ట్రమంతా ఏకరీతిగా వుండేలా భూ కమతాలపై సీలింగ్‌ను తగ్గించే లక్ష్యంతో 1960 భూ హెూల్డింగ్ చట్టం తీసుకు రావడంలో ముఖ్యమంత్రిగా కీలకపాత్ర పోషించారు. 1952లో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేస్తున్నప్పుడు జమీందారీ వ్యవస్థను రద్దు చేసే ప్రయత్నాలకు ఆయన నాయకత్వం వహించారు. రుణ విముక్తి బిల్లు 1939 సూత్రీకరణ అమలు ఆయన నాయకత్వంలో జరిగింది.వడ్డీ వ్యాపారుల నుంచి రైతాంగానికి ఉపశమనం కలిగించడమే ఈ బిల్లు లక్ష్యం.1950 లలో ఉత్తరప్రదేశ్ లోని అప్పటి ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లబ్ పంత్ పర్యవేక్షణలో భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని అత్యంత విప్లవాత్మక భూ సంస్కరణల చట్టాలను రూపొందించడంలోను,వాటిని ఆమోదించడంలోనూ చరణ్ సింగ్ మంచి గుర్తింపు పొందాడు.దేశాన్ని అనుక్షణం అప్రమత్తతతో కంటికి రెప్పలా కాపాడే సైనికులకు ఎంత ప్రాముఖ్యత ఉందో పట్టెడన్నం పెట్టే అన్నదాతలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రాధాన్యతను గుర్తించే దివంగత మలి ప్రధాని జై జవాన్... జై కిసాన్ అని నినదించారు. రైతును దేశానికి వెన్నుముకగా రైతులను అభివర్ణిస్తారు.రైతు అహర్నిశలు శ్రమిస్తే గాని మనకు తినడానికి తిండి దొరకదు.అయితే ఆరు గాలం కష్టపడినా, శ్రమకు ఫలితం లభిస్తుందనే నమ్మకం ఏ నాడూ ఉండదు. లేదు. రైతులు అటు ప్రకృతి మీద ఆధారపడి జీవనం సాగించడం సర్వత్రా కనిపించేదే. అతి వృష్టి,అనావృష్టి అన్నదాతల జీవితాలకు భరోసా లేని పరిస్థితి తెస్తున్నాయి.ఒత్తిళు ,, నష్టాలు, వ్యవసాయ పనుల చాకిరీకి తట్టుకోలేక చాలామంది రైతులు వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. వేసిన పంటలకు సరిగా దిగుబడి రాక అప్పుల బాధలు భరించలేక, సరైన సమయంలో రుణమాఫీ కాక, దిక్కుతోచని స్థితిలో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలు రైతులకైతే స్వంత భూమి కాక, వ్యవసాయ రుణాలు రాక, ప్రభుత్వ సహాయంకు నోచుకోక, యాజమాని కాకపోవడం వల్ల ప్రైవేటు రుణ సాయం దొరకక ఇబ్బందులకు గురవుతున్నారు.ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పంటలు పండిస్తే దళారులు రైతుల శ్రమను చౌకగా కొని ఎక్కువ రేట్లకు కొనుగోలు దార్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు కూలీగా,దళారులు సంపన్నులుగా అవుతున్నారు. పంటల విషయంలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత రైతులకు అవగాహన లేమికి కారణం అవుతోంది.కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు గత కాలంలో లాగా కాకుండా ప్రస్తుతం రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాయి. రైతులకు ఆర్థిక సాయం అందిస్తూ, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు బట్వాడా చేస్తున్నాయి. అయితే నకిలీ విత్తనాలు రాకుండా, గిట్టుబాటు ధర ఇవ్వాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వాలదే. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతులు దళారీల బారిన పడకుండా చూడాలి. రైతును వివిధ రకాలుగా మోసం చేసే వారిపై కఠిన చర్యలు గైకొనాలి. ప్రభుత్వ చేయూత, ఆర్థిక సాయం, సబ్సిడీలు, రుణ మాఫీలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండి, గతంలో సాగునీటికి పడిన ఇబ్బందుల పరిస్థితి కొంత మెరుగుపడి, సేద్యానికి అవసరమయ్యే సాగు నీరు అధిక శాతం సరఫరా అవుతున్న వేళ...వ్యవసాయం ఉద్యమం రీతిలో ముందుకు సాగాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.చౌదరి చరణ్ సింగ్ చేసిన అనేక ఉద్యమాల వల్ల జమీందారీ చట్టం రద్దై, కౌలుదారీ చట్టం అమలులోకి వచ్చింది. రైతులకు బ్యాంక్ ఋణాలు అందించే విధానము ప్రవేశ పెట్టబడింది. రైతుల గురించి, వ్యవసాయరంగం గురించి అంతగా ఆలోచించి,వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన చరణ్ సింగ్ సేవలకు గుర్తుగా ప్రభుత్వము చరణ్ సింగ్ జన్మదినోత్సవాన్ని జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించింది. చరణ్ సింగ్ మూడవ వర్ధంతి (1990, మే 29) సందర్భంగా భారత ప్రభుత్వం చరణ్ సింగ్ చిత్రంతో తపాలా బిళ్లను విడుదల చేసింది.రైతులు మరియు గ్రామీణాభివృద్ధికి ఆయన జీవితాంతం చేసిన కృషికి గుర్తింపుగా, న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్ స్మారక సముదాయంలో కిసాన్ ఘాట్ ("రైతుల వేదిక") అని పిలువబడే ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు .

# హిందీ చిత్ర పరిశ్రమలో అగ్రగామి పృథ్వీరాజ్

**-మే 29... పృథ్వీ రాజ్ కపూర్ వర్ధంతి**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

పృథ్వీరాజ్ కపూర్ భారతీయ థియేటర్ కు ఆద్యుడు. హిందీ సినీ పరిశ్రమలో పేరొందిన నటుడు. కపూర్ వంశ పితామహుడు,ఆయనకు సంబంధించి ఐదు తరాలు హిందీ సినిమా రంగం (బాలీవుడ్) లో నటించడం విశేషం.పృథ్వీరాజ్ 1906, నవంబరు 3న పాకిస్తాన్ లోని లయాల్‌పూర్ వద్ద (ఇప్పుడు ఫైసలాబాద్) ఉన్న సముంద్రీ లో మధ్య తరగతి, హిందూ ఖత్రి కుటుంబంలో జన్మించాడు. పృథ్వీరాజ్ పంజాబీ,హిందీ భాషలు మాట్లాడేవాడు. కపూర్ కుటుంబం పంజాబీ హిందూ మూలానికి చెందిన కుటుంబం. పృథ్వీరాజ్ కపూర్ ఈ కుటుంబం నుంచి మొట్టమొదటి సినిమా నటుడు. పాకిస్థానీ పంజాబ్ లోని సముంద్రి పట్టణంలో 1906లో జన్మించారు పృథ్వీరాజ్.ఆయన తండ్రి బసవేశ్వర నాథ్ కపూర్ పేష్వార్ లో భారత ఇంపీరియల్ పోలీస్ శాఖలో పోలీసు అధికారిగా పనిచేశాడు. పృథ్వీరాజ్ తాత సముంద్రి పట్టణానికి తహశీల్దారుగా వ్యవహరించేవారు. తన స్వస్థలమైన లిల్లాపూర్, పెషావర్లలో థియేటర్ ఆర్టిస్ట్ గా తన నటనా వృత్తిని ప్రారంభించాడు. 1928 లో, పృథ్వీరాజ్ తన అత్త నుండి అరువు తెచ్చుకున్న కొంత డబ్బుతో బొంబాయికి (ఇప్పుడు ముంబై) వెళ్లి ఇంపీరియల్ ఫిల్మ్ కంపెనీలో చేరాడు. సంస్థలో సినిమాల్లో చిన్న పాత్రలు చేయడం ప్రారంభించాడు. 1929 లో కపూర్ తన మూడవ చిత్రం సినిమా గర్ల్ లో మొదటి ప్రధాన పాత్రను పొందాడు.దో ధారి తల్వార్ , షేర్-ఎ-అరా బి మరియు ప్రిన్స్ విజయ కుమార్ వంటి తొమ్మిది నిశ్శబ్ద చిత్రాలలో పృథ్వీరాజ్ నటించాడు. 1931లో,భారత దేశంలో మొట్టమొదటి టాకీ, "ఆలం అరా" విడుదలైంది. ఆ చారిత్రక చిత్రంలో కపూర్ సహాయక పాత్ర పోషించాడు. ప్రఖ్యాత థియేటర్ నటుడిగా, పృథ్వీరాజ్ బ్రిటిష్ ప్లేహౌస్ అయిన గ్రాంట్ ఆండర్సన్ థియేటర్ కంపెనీలో చేరాడు. ఆయన చేరిన వెంటనే కంపెనీ ఇంగ్లాండ్‌కు మారింది .1946 లో, పృథ్వీరాజ్ కపూర్ పృథ్వీ థియేటర్స్ అనే థియేటర్ సంస్థను స్థాపించాడు,పృథ్వీరాజ్ పృథ్వీ థియేటర్ల లో పెట్టుబడులు పెట్టాడు, ఇది భారతదేశం అంతటా చిరస్మరణీయమైన ప్రదర్శనలను అందించింది. ఆ నాటకాలు అత్యంత ప్రభావవంతమైనవి. భారత స్వాతంత్ర్య ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడానికి యువతను ప్రేరేపించాయి.16 సంవత్సరాల కాలం లో థియేటర్ 2,662 ప్రదర్శనలను ప్రదర్శించింది. ఇందులో పృథ్వీరాజ్ ప్రధాన నటుడిగా నటించాడు. 1996 లో, థియేటర్ యొక్క గోల్డెన్ జూబ్లీలో, ఇండియన్ పోస్ట్ రెండు రూపాయల పోస్టల్ స్టాంప్‌ను జారీ చేసింది.భారతీయ సినిమా 100సంవత్సరాల సందర్భంగా, మరొక తపాలా బిళ్ళను ఇండియా పోస్ట్ 3 మే 2013 న విడుదల చేసింది. ఆయన ప్రసిద్ధ నాటకాల్లో ఒకటైన ఒక ముస్లిం మరియు హిందూ స్నేహితుడి కథ, 13 ఏప్రిల్ 1947న ప్రారంభమైన "పఠాన్" నాటకం.అది ముంబైలో దాదాపు 600 సార్లు వేదికపై ప్రదర్శించ బడింది. 1950 దశాబ్దం చివరినాటికి, ట్రావెలింగ్ థియేటర్ యుగం,సినిమా ప్రభావ కారణంగా అంతిమ దశకు చేరుకుంది. క్రమంగా పృథ్వీ థియేటర్ కార్యకలాపాలను నిలిపి వేసాడు.తన సొంత కుమారులతో సహా చిత్ర నిర్మాతల నుండి అప్పుడప్పుడు ఆఫర్లను అంగీకరించాడు.తన కుమారుడు రాజ్ కపూర్‌తో కలిసి 1951 చిత్రం అవారా లో కనిపించాడు. తరువాత, పృథ్వీ థియేటర్ ఇండియన్ షేక్స్పియర్ థియేటర్ సంస్థ "షేక్స్పియెర్నా" తో విలీనం అయ్యింది. సంస్థ 5 నవంబర్ 1978 న ముంబైలో పృథ్వీ థియేటర్ ప్రారంభోత్సవంతో శాశ్వత గృహాన్ని పొందింది. ఆయన చిత్రాలలో ఒకటి, కల్ ఆజ్ అవుర్ కల్ , కపూర్ కుటుంబానికి చెందిన మూడు తరాలు - కుమారుడు రాజ్ కపూర్, మనవడు రణధీర్ కపూర్ మరియు పృథ్వీరాజ్. పృథ్వీరాజ్ తండ్రి, దేవాన్ బాషేశ్వర్నాథ్ కపూర్ కూడా రాజ్ కపూర్ చిత్రం అవారాలో అతిథి పాత్రలో నటించారు.పృథ్వీరాజ్ ముగ్గురు కుమారులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ లు గొప్ప నటులే. భారతీయ సినిమా చరిత్రలో రాజ్ కపూర్ ను "ది గ్రేటెస్ట్ షోమాన్"గా అభివర్ణిస్తారు. రాజ్ కపూర్ బాలీవుడ్ లో ప్రసిద్ధ నటుడే గాక, నిర్మాత, దర్శకునిగా కూడా మంచి కృషి చేశాడు. రాజ్ కపూర్ కుమారులు రణధీర్ కపూర్, రిషి కపూర్ లు బాలీవుడ్ లో మంచి నటులుగా గుర్తింపు తెచ్చుకోగా, చిన్న కుమారుడు రాజీవ్ కపూర్ మాత్రం అంతగా రాణించలేదు. శశి కపూర్ కుమార్తె సంజన కపూర్ కూడా నటిగా మంచి గుర్తింపే తెచ్చుకున్నది. కానీ ఆమె చాలా తక్కువ సినిమాల్లో నటించింది.

# సేవే లక్ష్యంగా గ్రామాల అభివృద్ధి

**-కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన జువ్వాడి నర్సింగరావు**



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, మే 28 :** దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న కొండ్రికర్ల-కొనరావుపేట గ్రామాల మధ్య వాగుపై గల బ్రిడ్జీకి కాంగ్రెస్ ప్రభుత్వంతో మహర్ధశ వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రజల సేవే లక్ష్యంగా అభివృధికై ముందడుగు వేస్తున్నట్లు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు.బుధవారం బ్రిడ్జి నిర్మాణ పనులకు రూ 6కోట్ల 80లక్షల నిధులు మంజూరవగా స్థానిక నాయకులతో గ్రామస్తులతో కలిసి నూతన బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు కు గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఘనస్వాగతం పలుకగా సిఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క జువ్వాడి నర్సింగరావు జువ్వాడి కృష్ణారావు చిత్రపటాలకు గ్రామస్తులు క్షీరాభిషేకం జరిపారు.అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణానికి మహర్దశ వచ్చిందాని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేని పనిని గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చినమాట మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి 6 కోట్ల 8 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని గెలుపైన ఓటమైన ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యం అన్నారు.నిధుల మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి,పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు తిపిరెడ్డి అంజిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి,నాయకులు కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి,జెట్టి లక్ష్మణ్,గడ్డం గంగారెడ్డి,తదితర నాయకులు, కార్యకర్తలు,మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



**చురకలు విలేకరి, కొడిమ్యాల, మే 28 :** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ అన్నారు. బుధవారం కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు కోనాపూర్, తిప్పాయిపల్లి గ్రామంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, విత్తనాలను స్టాక్ రిజిస్ట్రర్లను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు తమ స్టాక్ వివరాలను అప్డేట్ చేయాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే పిడియాక్ట్ అమలు చేస్తామన్నారు. ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు, ధరల పట్టికలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఆటో దొంగలించిన వ్యక్తి అరెస్టు

**-వివరాలు వెల్లడించిన జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 28 :**

ఆటో దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణం లోని కోర్టు ఆవరణలో మే 27న నిలిపి ఉన్న ఏపి 01 టిఏ 0114 నంబర్ గల ఆటోను దొంగలించారని మగ్గిడి కృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని, మంగళ వారం సాయంత్రం పట్టణంలోని గాంధీనగర్ వద్ద ఎస్ఐ గీత ఆధ్వర్యం లో వాహనాల తనిఖీలు చేపడుతున్న క్రమంలో ఏపి 01 టివి 0114 నంబర్ గల ఆటోను.జీలకర్ర ప్రసాద్ అనే వ్యక్తి నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడైన జీలకర్ర ప్రసాద్ను రిమాండ్కు తరలించినట్లు వివరించారు.

# పశువుల అక్రమ రవాణా నివారణకు అప్రమత్తంగా ఉండాలి

**-కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆర్నకొండ చెక్ పోస్ట్ తనిఖీ**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ మే 28 :**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్నకొండ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ చెక్ పోస్ట్ ను అక్రమ పశువుల రవాణా నివారణకు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ చెక్ పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గూడ్స్ వెహికల్ ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. విధులను నిర్వర్తించేటప్పుడు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, చొప్పదండి ఎస్సై శ్రీ మామిడాల సురేందర్, ప్రొబేషనరీ ఎస్సై మనీషా తో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రెస్క్లబ్ అధ్యక్షునికి సన్మానం



**చురకలు విలేకరి, మెట్ పల్లి, మే 28 :** మెట్ పల్లి టియుడబ్ల్యూజే హెచ్-143 ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఇటీవలే నియమితులైన ఆంధ్రప్రభ మెట్ పల్లి ఆర్సీ ఇంచార్జి లక్కం మల్లేష్ యాదవ్ ను బుధవారం పిఏసిఎస్ చైర్మన్ కోమిరెడ్డి తిరుపతి రెడ్డి శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపు



**చురకలు విలేకరి, మల్లాపూర్, మే 28 :** రెక్కాడితేకాని కడుపు నిండని నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన నల్ల దివ్య కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి వెన్నుపూస, రెండు కాళ్ళ కిళల్లో ఏముకలు అరిగినవి వాటికి ఆపరేషన్ చెయ్యాలని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్థోమత లేక పోవడంతో చికిత్సకు దాతల కోసం ఎదురుచూస్తుంది. ఫోన్ పే నంబరు 9701197060 దాతలు ఎవరైనా ఉంటే ఆదుకోవాలని కోరారు.

## ఘనంగా ఎన్టీఆర్ 102వ జయంతి



**చురకలు విలేకరి, మల్లాపూర్, మే 28 :** మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు సిర్ పూర్ గ్రామంలో ఎన్టీఆర్ 102 వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ రేగుంట అనాధాశ్రమంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ఎండి సాదుల్లా మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీ కోసం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడిన సందర్భాలను గుర్తు చేశారు. పలు సంక్షేమ పథకాలు ఆయన అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో దామెర లక్ష్మారెడ్డి, సామర్ల రాజలింగం, ఏనుగు చిన్న రాజిరెడ్డి, జంబుకా హనుమాన్లు, దూదేకుల ఇమామ్, సంపత్తి నడిపి గంగారాం, శేఖర్, సాగర్, ఉపేందర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



**చురకలు విలేకరి, మల్లాపూర్, మే 28 :** మండల కేంద్రంలోని దుర్గమ్మ కాలనీలో ఎస్సీ సబ్ ప్లాన్ పథకం కింద 5 లక్షల రూపాయలతో మంజూరైన నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం మాజీ జడ్పిటిసి సంధిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ వరకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సహకారంతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగస్వామి గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శరత్ గౌడ్, మాజీ వార్డు మెంబర్ కోడూరి బిక్షపతి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దిరెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

## -జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 28 :** జగిత్యాల పట్టణ అభివృద్ధి నిరంతరం కృషి చేస్తానని,ప్రతి అధికారి, నాయకులు బాధ్యతతో పని చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని 25.26వ వార్డుల్లో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులను బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో జగిత్యాల పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని, డబుల్ బెడ్రూం ఇండ్ల మౌళిక సదుపాయాల కల్పన రూ.34 కోట్లతో, రూ.40 కోట్లతో జగిత్యాల పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, లేఅవుట్ ప్రకారం ప్రజలు ఇండ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్లు.ఆడువాల జ్యోతి లక్ష్మణ్. గిరి నాగభూషణం, నాయకులు గోలి శ్రీనివాస్, ఆరుముల్ల పవన్, భూమయ్య, డిఈ నాగేశ్వర్, డిఈ పబ్లిక్ హెల్త్ వరుణ్, ఏఈ శరణ్, టిపిఓ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మహమ్మద్ ప్రవక్తపై

# అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

## -యూట్యూబర్ చిలుక ప్రవీణ్ పై చర్య తీసుకోవాలి




**చురకలు విలేకరి, కోరుట్ల,మే 28 :** మహమ్మద్ ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని కోరుట్ల మైనార్టీ సోదరులు పేర్కొన్నారు. బుధవారం మహమ్మద్ ప్రవక్త పై యూట్యూబర్ చిలుక ప్రవీణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జామితే ఐలే హదీస్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అన్వర్ సిద్దీఖీ మాట్లాడుతూ చిలుక ప్రవీణ్ యూ న్యూస్ అనే యూట్యూబ్ ఛానల్ నడుపుతూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ ఇస్లాం మరియు మహమ్మద్ ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రవక్త 14 వివాహాలు చేసుకున్నారని యూట్యూబ్లో తప్పుగా ప్రచారం చేస్తున్నాడని,90 సంవత్సరాల వయసు లో 25 సంవత్సరాల యువతిని వివాహం చేసుకున్నాడని అసత్య ప్రచారాలు చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో ముస్లింలు మనోభావాలు దెబ్బతినే లాగా ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలాగా ఉన్నాయిని ఆరోపించారు.దీనిపై ప్రవీణ్ను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానల్లను నియంత్రించాలని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొని కేసులు పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో జామితే ఐలే హదీస్ పట్టణ కమీటి సభ్యులు ఫారుక్, అలీం, మీర్జా బాబా, షకీల్, ఇర్ఫాన్, బాషు బాయ్,యూసుఫ్, న్యాయవాదులు మాజార్,ఫసీ ఉద్దిన్, మహమ్మద్ వకీల్, బారీ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి కార్మికుల హక్కుల

# సాధనలో ఏఐటీయూసీ ముందంజ



## -ఏఐటీయుసీ నాయకులు సమ్మయ్య వైవి రావు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** సింగరేణి కార్మికుల హక్కులు సాధనలో ఏఐటీయూసీ ముందు వరుసలో ఉందని కార్మిక సాంగ నాయకులు సమ్మయ్య వైవి రావు అన్నారు. బుధవారం ఏ ఎల్ పీ గని లో ఫిట్ సెక్రటరీ గంగాధర్ అధ్యక్షతన ఏఐటియుసి గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ గేట్ మీటింగ్ కి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ లు ముస్కె సమ్మయ్య వైవి రావు సెంట్రల్ సెక్రటరీ జూపాక రామచందర్, ఆర్ జి త్రీ బ్రాంచ్ సెక్రెటరీ ఎం ఆర్ సి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కి సమ్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి ముష్కే సమ్మయ్య వైవి రావు ఏఐటియుసి సాధించినటువంటి కార్మిక హక్కులను కార్మికులు వారి పిల్లల కోసం లక్షల రూపాయలు విద్య కొరకు ఖర్చు చేయుచున్నారని వాటిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యంతో సెంట్రల్ సిలబస్ విద్యను భూపాల్ పల్లి కొత్తగూడెం రామగుండంలో సెక్టార్ త్రీ పాఠశాలలలో ప్రారంభించినారని, కార్మికులకు ప్రమోషన్ పాలసీలో ప్రమోషన్ వచ్చిన ప్రతి కార్మికునికి ప్రమోషన్ ఇంక్రిమెంట్లు ఇప్పించడం జరుగుతుందని సింగరేణిలో కార్పొరేట్ వైద్యం కోసం హైదరాబాదులో సింగరేణి కార్పోరేట్ వైద్యశాలను ఏర్పాటు చేయించడం జరుగుతుందని అదేవిధంగా సొంతింటి పథకాన్ని అమలు చేయడానికి కృషి చేస్తుందని తెలియజేయడం జరిగింది మరియు ఏఎల్పి కార్మికులకు 150 మందికి సర్ఫేస్ జనరల్ మజ్దూర్లు గా ఇప్పించి ఓసీపీ లకు ఇప్పించడం జరిగింది, జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్లుగా డిస్మినేషన్ మార్చి ఇప్పించడం జరిగింది. సింగరేణిలో ఏఐటీయూసీ కార్మికులకు చేయుచున్న కృషిని కార్మికులు దృష్టిలో పెట్టుకొని ఏఐటీయూసీ యూనియన్ కు ఆకర్షితులై హెచ్ఎంఎస్ ఇతర యూనియన్ల నుండి స్వచ్ఛందంగా ఏ ఎల్ పి ఆర్ జి త్రీ బ్రాంచ్ , ఫిట్ కమిటీ నాయకులు క్రాంతి ఆధ్వర్యంలో డెలిగేట్స్ కార్యకర్తలు 150 మంది ఏఐటీయూసీలో చేరడం జరిగింది డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు వైవి రావు ముష్కి సమ్మయ్య వారిని యూనియన్ లోకి కండువాలు కప్పి సాధారంగా యూనియన్ లోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కార్యకర్తలు డెలిగేట్స్ సానుభూతిపరులు కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు భద్రతా నియమాలు పాటించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 28 :** జగిత్యాల జిల్లాలో కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు భద్రత నియమాలు పాటించాలని జగిత్యాల టిజి ఎస్పిడిసిఎల్ ఎస్ఈ సాలియా నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ ప్రగతి భవన్లో కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సాలియానాయక్ మాట్లాడుతూ పట్టణంలోని భద్రత, నిర్వహణ సౌలభ్యం దృష్టి కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు తమ ఓవర్హెడ్ కేబుళ్లను బంచ్ చేసి క్లాంప్స్ అమర్చాలన్నారు. దీంతో ప్రజలకు భద్రత మెరుగవ్వడంతో పాటు,కేబుళ్ల మరమ్మత్తు సులభత సాధ్యమవుతుం దన్నారు. ఈ సమావేశంలో టౌన్ సబ్ డివిజన్ డిఈ, ఏడిఈలు, ఏఈలు, కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# గంజాయితో పట్టుబడిన యువకుడు

**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, మే 28 :** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఓ యువకుడు బుధవారం గంజాయితో పట్టుబడినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అనుమానస్పదంగా కన్పించిన యువకుడిని తనిఖీ చేయగా అతని వద్ద నుండి 120 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. యువకుడు ఖానాపూర్ కు చెందిన బోదాసు రాము అని, గంజాయి విక్రయించేందుకు వచ్చినట్లు నిర్ధారించి రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భారీగా ఇసుక డంపుల సీజ్



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, మే 28 :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరిపిన భారీగా ఇసుక నిల్వలు చేసిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు.బుధవారం మెట్ పల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 100 ట్రిప్పుల ఇసుక డంపులను తహసీల్దార్ శ్రీనివాస్ పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.అనుమతులు లేకుండా ఎవరు ఇసుక అక్రమ నిల్వలు చేయరాదని,అక్రమ ఇసుక రవాణా చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆయన వెంట ఆర్ఐ ఉమేష్, సిబ్బంది ఉన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన బీర్పూర్ తహసీల్దార్



**చురకలు విలేకరి, బీర్పూర్, మే 28 :** బీర్పూర్ మండల తహసీల్దార్గా బాధ్యతలు స్వీకరించిన గడప సుజాత బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు తహసీల్దార్ సుజాత మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన కొనుగోళ్లు

**-వరి ధాన్యం మొలకెత్తాయి**
**-లబోదిబోమంటున్న రైతులు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మే 28 :** నిర్వాహకుల వల్ల రైస్ మిల్లర్ల నిర్లక్ష్యం వల్ల కొనుగోళ్లు నిలిచిపోయి వరి ధాన్యం మొలకెత్తాయి,దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మాయిచ్చర్ వచ్చి 45 రోజులు గడుస్తున్న సరైన కొనుగోలు ప్రక్రియ లేక ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపురం గ్రామంలో వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు,ఇటీవల కురిసిన వర్షాల మూలంగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టి అనంతరం మ్యాచర్ వచ్చిన వరి ధాన్యం రాసులు పోసి వాటిపై టార్పాలిన్ కవర్స్ కిరాయికి తెచ్చి వరి ధాన్యం తడవకుండా కప్పులు వేశారు. గాలితో కూడిన వర్షం రావడంతో కప్పులు ఎగిరిపోయి వరి ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యాయి.మొలకెత్తిన తడిచిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైసు మిల్లర్లు కొనకపాయిరి.మాకు ఇబ్బందులు తప్పట్లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైస్ మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైసు మిల్లులకు పూర్తిగా తరలించి కొనుగోలు కేంద్రాలు కంప్లేట్ అయినట్టు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.అరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి ముద్దవ్వడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. హమాలీ కూలీలు,ఐకెపి నిర్వాహకులు, రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం కారణంగానే తాము ఇబ్బందుల పాలవుతున్నామన్నారు .వేరే రైస్మిల్లులకు తీసుకపోయి అమ్ముదామన్న అమ్మనివ్వని పరిస్థితి ఉందని కొనుగోలు కేంద్రాలలో తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# మనీష్ యాదవ్‌కు గౌరవ డాక్టరేట్ అవార్డు

**చురకలు ప్రతినిధి కరీంనగర్ మే 28 :** కరీం నగర్ కు చెందిన లోడ మనీష్ యాదవ్ కు గౌరవ డాక్టరేట్ పట్టాను ఢిల్లీలో అందజేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ సైబర్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఫోనిక్స్ తరఫున దేశంలోని ఎన్నో సంస్థలకు లా ఎన్ఫోర్స్మెంట్ వారికి విద్యార్థులకు నిరుద్యోగ యువతకు కార్పొరేట్ కంపెనీలకు సైబర్ భద్రత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు అధునాతన సాంకేతిక లోపాలను ఎలా కనుగొని నివారించాలి అనే అవగాహన సదస్సు నిర్వహించి 15 సంవత్సరాలుగా వేలాది కార్యక్రమాలు లక్షలాది మందికి నైపుణ్యం ఇవ్వడం గుర్తించి ఆయనకు ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ (ఢిల్లీ,) వారు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సన్మానించారు. దేశంలోనే అత్యున్నత విశిష్టత సోర్స్ కాన్స్టిట్యూషన్ క్లబ్ తరఫున ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. లోడా మనీష్ యాదవ్ కు గౌరవ డాక్టరేట్ పట్టి సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోర్నిక్స్ నందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సుప్రీంకోర్టు న్యాయవాదులు పలు యూనివర్సిటీల ప్రొఫెసర్లు వాయు శాఖ మరియు కర్నల్ లు పాల్గొన్నారు.



అలాగే మనీష్ యాదవ్ కరీంనగర్ ఎల్ఎండిలో ఎస్సారెస్పీ డిపార్ట్మెంట్లో ఉద్యోగం చేసి పదవి విరమణ పొందారు.అవార్డు రావడం పట్ల జబ్బార్ ఖాన్, ఆడవళ చంద్రయ్య, అజ్జు, బిజిగిరి సదయ్య, ఆకుల ఓదెలు, వి ఎస్ ఎస్ రాజేష్,పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మన అందరీ బాధ్యత

**-జిల్లా విద్యాశాఖ అధికారిని డి.మాధవి**
**ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చునని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) పెద్దపల్లి నందు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణను బుధవారం ఉదయం ప్రారంభించిన డి.ఇ.ఓ %డ% ప్రజ్వల సంస్థ మేనేజర్ డి.ఇ.ఓ డి.మాధవి ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య. దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువ గా గురవుతున్నారు. సమాజంలో ప్రజలతో, విద్యార్థులతో




సన్నిహితంగా ఉండి గమనించి వారికి అవగాహనా కల్పించాలి, ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్ లలో వారికి అవగాహన కల్పించాలి. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జఠిలమైన సమస్య కాబట్టి పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణాలతో పాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయి, మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి వాళ్ళను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారు, కాబట్టి మన డిపార్ట్మెంట్ జిల్లా నుండి గ్రామ స్థాయి వరకు అందరూ అవగాహన కలిగి ఉండి, అప్రమతం చేయడం ద్వారా దీన్ని నిర్ములించవచ్చునన్నారు. ప్రజ్వల సంస్థ మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవచ్చు, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీని బారిన పడుతున్నారు. ముక్యంగా యువత, పిల్లలు ఆకర్షణకు గురి అయి, పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో అమ్మబడుతున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 30 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడడం జరిగింది. ఇందులో చిన్న పిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఈ అక్రమ రవాణా చాలా పెరిగి పోయింది, ముక్యంగా విద్యార్థులు అనవసరం అయినా అప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు. మీరు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న మన సిబ్బంది ఈ విషయాలపై అవగాహనా పొంది ఇతరులకు అవగాహనా కల్పించాలని సూచించారు.ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ అదారిత అక్రమ రవాణా, చట్టాలు , బి ఎన్ ఎస్, ఐటిపిఏ, పి ఓ కే ఎస్ ఓ, ఈసీఎంఏ, సఖి, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100, 181, 1930, 181 ల గురించి చెప్పడం జరిగింది.ఈ శిక్షణా కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిని మాధవి, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, జి.సి.డి.ఓ జి. కవిత,ప్రదానోపాధ్యాయురాలు టి. అరుణ, ప్రజ్వల సిబ్బంది అంబర్ సింగ్, జిల్లాలోని కె.జి.బి.వి,ఆదర్శ పాఠశాల,పలు రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ మే 28 :** నగరంలోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాలలో ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న పి బాలకిషన్ కు గైడ్ డాక్టర్ ఐ ఏ చిదంబరం గారి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసిందని కళాశాల చైర్మన్ శ్రీ ముద్దసాని రమేష్ రెడ్డి గారు తెలిపారు.“అప్లికేషన్ ఆఫ్ నోవెల్ కంట్రోల్ టెక్నిక్ ఫర్ రెన్యూయబుల్ ఎనర్జీ సిస్టమ్స్ ఇన్ స్మార్ట్ గ్రిడ్“ అనే అంశం పైన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ పట్టాను పొందారని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ ముద్దసాని రమేష్ రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల డైరెక్టర్ శ్రీ కర్ర నరేందర్ రెడ్డి గారు, ప్రిన్సిపల్ డాక్టర్ ఏ ప్రసాద్ రాజు గారు, ఇతర విభాగాధిపతులు, పాలనాధికారి మరియు అధ్యాపక బృందం పి. బాలకిషన్ కు, అభినందనలు తెలిపారు.

## జూలపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో ఈ నెల 30న పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ముస్త్యాల వాసంతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో షెడ్యూల్డ్ కులము లు, షెడ్యూల్డ్ తెగల జాతుల పై అంటరానితనం, దేవాలయం లోనికి ప్రవేశం, హెరీటల్ లో రెండు గ్లాసుల పద్ధతి, ప్రభుత్వ కుళాయిల వద్ద అస్పృశ్యత వంటివి నిర్మూలన చేయడం కోసం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమానికి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు అంబేద్కర్ సంఘ నాయకులు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి కొలుపు ఉత్సవాలు ప్రారంభం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 28 :** కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి కోల్పోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పెద్దమ్మ తల్లికి అభిషేకం, గణపతి పూజ, పుణ్యా వచనము, పంచామృత అభిషేకం, అలంకరణ, మంగళ హారతి నిర్వహించారు. అలాగే మహిళలు భారీ ఎత్తున ఇంటింటికి బోనాలు తీసి తమ ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లికి సమర్పించారు. ఉదయం పెద్దమ్మ తల్లికి పాలకొరక వేయడం జరిగింది. ముదిరాజ్ భక్తులు హాజరయ్యారు. ఈ వేడుకలకు గాను వివిధ ప్రాంతాల్లో నుండి వారి వారి కుటుంబ సభ్యులు మరియు బంధువులు హాజరయ్యారు. గురువారంతో పెద్దమ్మతల్లి కొలుపు ఉత్సవాలు పూర్తికానున్నాయి.

# గర్భిణీలకు పౌష్టిక ఆహారం పంపిణీ




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** గోదావరిఖని బాపూజీ నగర్ లోని , గర్భిణి మహిళలకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ,సురభి శ్రీధర్ జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం పౌష్టిక ఆహారం సంబంధించిన వస్తువులను అమ్మ పరివార్ స్వచ్ఛ సేవ సంస్థ ఆధ్వర్యంలో డా. సురభి శ్రీధర్ అందించారు. అనంతరం సురభి శ్రీధర్ మాట్లాడారు. గర్భిణీ తో ఉన్న మహిళలు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీ తో ఉన్న ప్రతి మహిళ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమ్మ పరివర్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. నిస్సహాయ పిల్లలకు ఆశ్రయం ఇవ్వడం కాకుండా ప్రతిరోజు నిస్సహాయులకు, నిర్భాగ్యులకు అన్న దాన కార్యక్రమం చేపడుతున్న సంస్థ బాధ్యులందరికీ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ పక్షాన ధన్యవాదములు తెలుపుతున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి సహస్ర అమ్మ పరివార్ సంస్థ నిర్వాహకులు మంద నాగరాజు, కరణ్, అంగన్వాడి టీచర్ రమా తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లులేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు

**-మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 28 :** కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఇండ్లులేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,పట్టణ అధ్యక్షులు చెన్ని బాబులు పేర్కొన్నారు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన 1) జేరిపోతుల వసంత భర్త నాగరాజు,2) ఉశి రాజవ్వ భర్త కాశయ్య,3) ఏర్పుల పద్మ భర్త బుచ్చయ్య,లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా బుధవారం గృహ నిర్మాణాలకు భూమి పూజలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రామ్ రెడ్డి నాయకులు పందిర్ల లింగం గౌడ్ వంగ గిరిధర్ రెడ్డి ఇంద్రమ్మ కమిటీ మెంబర్ పుల్లయ్య గారి తిరుపతి గౌడ్ గంట బుచ్చయ్య గౌడ్ మస్కూరి శాంసన్ బి పేట రాజ్ కుమార్, కుమ్మరి రాజేష్ జేరిపోతుల రాములు మస్కూరి లక్ష్మణ్, దాసరం పోచయ్య అంతేర్పుల ఎల్లయ్య అశోక్ అనిల్ లు పాల్గొన్నారు.

# తహాశీల్దార్‌కు వినతి



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ మే 28 :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కోతిరాంపూర్ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాల నుంచి నిలువ ఉంచిన మున్సిపల్ వ్యర్థాలను అధికారులు మానకొండూరు మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులోని జ్వాల గుట్ట, తమిళ కాలనీ వాసుల ఇండ్లను అనుకోని పోయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఇండ్లకి పక్కన వీరన్న దేవాలయం ముందు భాగంలో రైతులు వెళ్లేదారిని ఆనుకొని మరియు నేషనల్ హైవేకు 70 మీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కోతి రాంపూర్ డంపింగ్ యార్డ్ పరిధిలో గల వ్యర్థాలు అన్నిటిని ఇక్కడ వేయడం వలన ఇక్కడ నివాసం ఉంటున్న తమిళ కాలనీ ప్రజలకు ఈగలు మరియు దోమలు,క్రిమి కీటకాల వలన వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది మరియు దుర్వాసన వలన అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. వర్షాకాలంలో జ్వాల గుట్ట నుండి జాలు మూడు నెలలు పోతుంది ఈ గుట్టను అనుకొని మున్సిపల్ వ్యర్థాలను పోసినట్లయితే జాల నీరు వ్యర్థాలతో కలిసి వర్షపు నీరును మేకలు గొర్రెలు, పశువులు, వన్యప్రాణులు త్రాగడం వలన అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున మున్సిపల్ నుండి వచ్చే వ్యర్థాలను జ్వాల గుట్ట దగ్గర నివాసిత ప్రాంతాల్లో పోయకుండా ఉండాలని మానకొండూరు మండల తాసిల్దార్ గారికి ముంజంపల్లి గ్రామ జ్వాలగుట్ట రైతులు, నివాసితులు ఈరోజు వినతిపత్రం సమర్పించడం జరిగింది.

# ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిఎం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :**

జూన్ 2 తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయవలసిన ఏర్పాట్లను బుదవారం పరిశీలించిన రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ రకాల స్టాల్స్, సభ ప్రాంగణం, అమర వీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను ఏ విధంగా చేయాలో అలాగే వేడుకలకు హాజరైయ్యే వారికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని పేర్కొన్నారు. వారి తో పాటు ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎలక్ట్రికల్ డివైఎస్ఇ సంజీవ్ కుమార్, అధికారులు సునిల్ ప్రసాద్, రాజేశం తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహిళలకు అండ షీ టీం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** మహిళలకు అండ షీ టీం అని షీ టీం ఇన్చార్జి ఎస్సై లావణ్య అన్నారు. బుధవారంరామగుండం సి.పి ఆదేశాల మేరకు, పెద్దపెల్లి లోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ లో గవర్నమెంట్ ఉపాధ్యాయుల కు జరిగే ట్రైనింగ్ లోని ఉపాధ్యాయులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఇంచార్జి లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్,స్నేహలత మరియు భరోసా కో ఆర్డినేటర్ అశ్రీత, భరోసా సపోర్టర్ అస్మా, మరియు హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ఆర్‌జి 3 ఎస్‌ఓటు జియంగా బాధ్యతల స్వీకరణ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మే 28 :** ఆర్.జి-3 ఏరియా ఎస్వోటుజియంగా నియమితులైన యం. రామ్మోహన్ బుధవారం ఆర్జీత్రీ, ఎపిఎ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావుకు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం రామ్మోహన్ ఆర్జి త్రీ ఏరియాలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మెడికల్ క్యాంప్ ఏర్పాటు



**చురకలు ప్రతినిధి కమాన్ మే 28 :** ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కరీంనగర్ లోని సన్ రైస్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్యాంపును జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు,ముత్తారం మండల మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్యాంపులో కేశనపల్లి గ్రామస్తులు 500కు పైగా ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్,గ్రామ శాఖ అధ్యక్షులు పెగడ కుమార్,గ్రామ యూత్ అధ్యక్షులు నవీన్,సన్ రైస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రక్షిత,క్యాంప్ మేనేజర్ రాజేందర్,కోఆర్డినేటర్ సతీష్,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తిరుపతి మరియు సన్రైజ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత

## -పర్యావరణ డైరెక్టర్




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** పర్యావరణాన్ని కాపాడు కోవడం మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ ను వాడద్దని కేంద్ర పర్యావరణ అండ్ అటవీ శాఖ డైరెక్టర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ శ్రీ కె.తరుణ్ కుమార్ అన్నారు.బుధవారం వారు రామగుండం -3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు. ముందుగా జియం కార్యాలయము నందు 22 మే నుండి 5 జూన్ వరకు నిర్వహిస్తున్న పర్యావరణ వక్షోత్సవాల అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర పర్యావరణ అండ్ అటవీ శాఖ డైరెక్టర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ శ్రీ కె.తరుణ్ కుమార్ పాల్గొని జిఎం కార్యాలయ అధికారులు,ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం పలువురు ఉద్యోగులకు జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు.తదుపరి జియం కార్యాలయ ఆవరణ లో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడు కోవడం మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని, ముఖ్యంగా ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ ను అసలే వాడద్దని,ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు.అనంతరం ఓసిపి-1 ఉపరితల గని రెమిడేషన్ ప్లాన్‌లో భాగంగా జూలపల్లి, ముల్కల పల్లి, పన్నూర్, రత్నాపూర్, నాగేపల్లి గ్రామాలలో చేపట్టిన చెక్ డ్యామ్ లు, సీసీ రోడ్లు, సోలార్ లైట్లు, ఇంకుడు గుంతలు, బస్ షెల్టర్లు, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఓసిపి-1 ఉపరితల గని లోని వ్యూ పాయింట్, పండ్ల మొక్కల పెంపకం, విండ్ బ్యారియర్, గ్రీన్ బ్యారియర్, ఎస్ టి పి ప్లాంట్ మొదలగునవి పరిశీలించారు. ఓసిపి -1 రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా చేపట్టిన పనుల వివరాలను రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎన్విరాన్మెంట్ విభాగం జనరల్ మేనేజర్ సైదులు, ఎస్వోటుజియం ఎం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్,ఎన్విరా న్మెంట్స్ డీజీఎంలు పి.రాజారెడ్డి, కిషన్, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఫారెస్ట్రీ విభాగాధిపతి కళ్యాణ్,కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం అధికారులు సిహెచ్. శ్రీనివాస్, రవి కిరణ్ తోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రవక్త గౌరవం ముస్లింలకు ప్రాణం కంటే విలువైంది

## -మహమ్మద్ ప్రవక్తను కించపరిచిన చిలుక ప్రవీణ్ పై పిడి యాక్ట్ పెట్టాలి
## -ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ డిమాండ్




**చురకలు విలేకరి,కరీంనగర్, మే 28 :** మహనీయ మహమ్మద్ ప్రవక్త గౌరవం ముస్లిం సమాజానికి ప్రాణం కంటే ప్రియమైనదని, ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ చిలుక ప్రవీణ్ పై, తక్షణమే అరెస్టు చేయాలని, పిడి యాక్ట్ పెట్టాలని మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చిలుక ప్రవీణ్ అనే వ్యక్తి కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టడమే పనిగా, మహనీయ ఇస్లాం ప్రియ ప్రవక్త ముహమ్మద్ పై, కనీస అవగాహన లేకుండా, సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం తన యూట్యూబ్ వ్యూస్ పెరగడం కోసం, అసత్య ప్రచారానికి దిగి, అసభ్యకరమైన పదజాలాన్ని వినియోగించాడాని, ఇలాంటి చర్యలను ఇస్లామిక్ ధార్మిక పండితులమంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. ఇతడు యూన్యూస్ పేరుతో యూట్యూబ్ ఛానెల్‌ను నడుపుతూ, మత విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, ముస్లిం సమాజాన్ని అవమానపరిచేలా..ఇస్లాం ప్రియ ప్రవక్త గురించి అశాస్త్రీయంగా, అవమానకరంగా మాట్లాడుతున్నాడని ఇతడికి తగిన గుణపాఠం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి డిజిపి కి, సిపికి విజ్ఞప్తి చేశారు. ఇతని వ్యాఖ్యలు కేవలం ముస్లింలనే కాకుండా, దేశంలోని మత సామరస్యాన్ని పూర్తిగా భంగపరచే ప్రమాదంలో నెట్టేలా ఉన్నాయని, పరారీలో ఉన్న చిలుక ప్రవీణ్ ను తక్షణమే అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో చిలుక ప్రవీణ్ అనే వ్యక్తి తన వ్యాఖ్యలతో కొత్త అలజడిని సృష్టించి మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రయత్నించాడన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మతతత్వ శక్తులకు చోటు లేకుండా నియంత్రించాలని, ఒకసారి కఠిన చర్యలు తీసుకుంటే ఇంకొకరు పరమతాలను అవమానపరిచే వ్యాఖ్యలు చేయరని ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట మే 28 :** ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య కోరారు.ఈ మేరకు ఇందిరమ్మ నిర్మాణాలు అన్ని గ్రామాలలో ప్రారంభం అయినాయని ఇంకా ప్రారంభం కానీ ఇండ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని అన్నారు 30 రోజుల వ్యవధిలో ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించినట్టుగా గృహ నిర్మాణ సంస్థ అధికారుల రికార్డుల ప్రకారం నమోదు కావాలన్నారు అలాగే ఇంకా ఎవరైనా పేదవారు ప్రస్తుతం ఇల్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉంటే వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు ఇప్పటివరకు ఎల్ వన్ ఎల్ టు ఎల్ త్రీ ల కింద ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను విభజన చేయడం జరిగిందన్నారు మొదటి దఫా లో ఎల్ వన్ లో ఉన్న వాటిని మాత్రమే నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు కానీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఎల్ వన్ ఎల్ టు ఎల్ త్రీ ఎందులో ఉన్న ఖాళీ స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి సిద్ధపడితే వారికి వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు ఇప్పటికే కొంతమంది బేస్మెంట్ లేవల్ ఉన్నవారికి కోసం ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతి కోసం లేక పంపించడం జరిగిందన్నారు వర్షాకాలం దృశ్య ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలన్నారు ఎక్కడ ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఇబ్బంది ఏర్పడిన సంబంధిత అధికారులను లేదా ఇందిరమ్మ కమిటీ సభ్యులను సంప్రదించి ఇసుకకు ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు సౌకర్యం కల్పిస్తామన్నారు,



# కోరుట్ల తహసిల్దార్‌గా కృష్ణ చైతన్య



**చురకలు విలేకరి, కోరుట్ల, మే 28 :** కోరుట్ల తహహసిల్దార్ గా సిహెచ్. కృష్ణ చైతన్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి తహసిల్దార్ గా బాధ్యతలు నిర్వహించిన ఆయన కోరుట్ల తహసిల్దార్ గా బదిలీ పై వచ్చారు. తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.కృష్ణ చైతన్య ను కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ ఫరూఖ్, గిర్దేవర్ రాజేంద్ర రావు, మహమ్మద్ అమర్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పంజాల శ్రీనివాస్




**చురకలు ప్రతినిధి కరీంనగర్ మే 28 :** భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు రెండు రోజులపాటు నగరంలోని లక్ష్మీ నగర్ లో గల మధు గార్డెన్ లో జరిగాయి.ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరయ్యారు.జిల్లా మహాసభలో నూతన కార్యవర్గం కౌన్సిల్ ఎన్నిక జరిగింది. 14 మందితో కార్యవర్గం 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు నలుగురు ఆహ్వానితులను మహాసభలో ఎన్నుకోవడం జరిగిందని, నూతన జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ప్రకటించారని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,తాజా మాజీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** తెలంగాణ ఉద్యమకారుడైన దూల మోహన్ను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా సన్మానించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నదన గార్డెన్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ సన్మానం నిర్వహించారు. ఇందులో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల మానవ వికాస వేదిక నాస్తిక్ వెంకన్న కళామండలి అధ్యక్షుడు దాసరి రామస్వామి జిల్లా అధ్యక్షుడు జూలమోహన్ కళాకారుడు వద్లకొండ రవి వర్మ లను ఘనంగా సన్మానించారు. దీనికిగాను ముఖ్యఅతిథిగా సీమ శ్రీనివాస్ మరియు ఐలన్న అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సాధనలో ముఖ్య భూమిక పోషించిన కళాకారులను ఉద్యమకారులను గుర్తించి ఈ సన్మాన సభ నిర్వహించారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసే బాధ్యత మన అందరిదీ

## -పర్యావరణ డైరెక్టర్ తరుణ్ కుమార్



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మే 28 :** ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసే బాధ్యత మనందరిపై ఉందని ఆర్జీ-2 ఏరియా లో పర్యటించిన కేంద్ర పర్యావరణ డైరెక్టర్,శాస్త్రవేత్త కె.తరుణ్ కుమార్ కత్తుల. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి అన్నారు.పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని,ప్లాస్టిక్‌ను వాడద్దని కేంద్ర పర్యావరణ అండ్ అటవీ శాఖ డైరెక్టర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ తరుణ్ కుమార్ కత్తుల అన్నారు.వారు బుధవారం రామగుండం 2 ఏరియాలో పర్యటించారు. ముందుగా వకీల్ పల్లి గని ఏజెంట్ కార్యాలయము నందు 22 మే నుండి 5 జూన్ వరకు నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణ క్యాంపెయిన్ లో బాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పర్యావరణ అండ్ అటవీ శాఖ డైరెక్టర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ శ్రీ తరుణ్ కుమార్ కత్తుల గారు పాల్గొన్నారు.వకీల్ పల్లి ఏజెంట్ కార్యాలయం నుండి అధికారులు, ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించి ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు ఉద్యోగులకు జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే నినాదంతో పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని, ముఖ్యంగా ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ ను అసలే వాడద్దని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం వకీల్ పల్లి భూగర్భ గని రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా పెంచికలపేట్, సమ్మక్క గద్దెలు, న్యూ పెద్దంపేట్, న్యూ మారేడుపాక, కోల్ కారిడార్ రోడ్డు అల్లూరి చెరువు మరియు చందనాపూర్ తదితర గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్లు, సోలార్ లైట్లు, దోబీ ఘాట్, అల్లూరు చెరువు కట్ట, బస్ షెల్టర్లు, ఇంకుడు గుంటలు, చేతి పంపులు పరిశీలించారు .ఆర్జి 2 ఏరియా వకీల్ పల్లి రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా చేపట్టిన పనుల వివరాలను రామగుండం-2 ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ బి వెంకటయ్య గారు తెలియజేశారు.కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ బి వెంకటయ్య గారు, కార్పొరేషన్ ఎన్విరాన్మెంట్ విభాగం జనరల్ మేనేజర్ శ్రీ సైదులు గారు, ఏజెంట్ వకీల్ పల్లి ఏ నెహ్రూ, కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం అధికారులు సిహెచ్. శ్రీనివాస్, రవి కిరణ్, వకీల్ పల్లి గని మేనేజర్ రవి కిరణ్, ఏరియా పర్యావరణ అధికారి సురేష్ బాబు, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మొహమ్మద్, డివైఎస్ఇ సివిల్ వినయ్ సాగర్, ఓసిపి 3 పర్యావరణ అధికారి వేణు కుమార్, ఫారెస్ట్ అధికారి నవీన్ కుమార్ మరియు డివైపిఎం శ్యాం ప్రసాద్ తోపాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు విద్యార్థులకు

# సరైన మార్గదర్శనం చేయాలి



## -జగిత్యాల డిఎస్పీ రఘుచందర్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మే 28 :**

ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేయాలని జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డిఎస్పీ రఘుచందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫోక్సో చట్టం, సైబర్ నేరాల గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరం ఉంచాలని, మత్తు పదార్థాలకు బానిస కాకుండా సరైన మార్గదర్శనం చేయాలన్నారు. అనంతరం వివిధ రకాల సైబర్ నేరాల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము. రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రాజకుమార్, జగదీశ్వర్, కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆహారపు అలవాట్లపై అవగాహన అవసరం

## -మే 29న... ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినం

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రతి ఒక్కరూ వారు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు. మనిషి బతకడానికి తిండి అత్యవసరం. అయితే తిన్న తిండి జీర్ణం కావడం అతి ముఖ్యం. అందుకే ఎలాంటి ఆహారం తినాలి? ఎంత తినాలి? అదెంత శుభ్రంగా ఉండాలి? ఉప్పు, కారం వంటి వాటితో పాటు ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలి? అనే అంశాలపై కనీస అవగాహన ఉండి తీరాలి. ఆరోగ్యానికి ఆహారమే పునాది. రోజును ఆరోగ్యకరమైన అల్పాహారంతో ప్రారంభించాలి. చాలావరకు జబ్బులకు గతి తప్పిన ఆహార అలవాట్లే కారణం. భోజనం చేసేటప్పుడు ప్రశాంతంగా ఉండాలి. భోజనం మీదే దృష్టి పెట్టి, రుచిని ఆస్వాదిస్తూ తినాలి. బాగా నములుతూ, నెమ్మదిగా తినాలి. పూర్తిగా నమలి తింటే ఆహారం బాగా జీర్ణమై, పోషకాలు సరిగా ఒంట పడతాయి. ఆహారంలో ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు అన్నీ సమతులంగా ఉండేలా చూసుకోవాలి. రోజుకు 400 గ్రాముల పండ్లు, కూరగాయలు తినాలన్నది ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు. వీటిల్లో 150




గ్రాముల పండ్లు, 250 గ్రాములు కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. మనిషి ఆరోగ్యం జీర్ణ వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. కొవ్వు పదార్థాలు కాకుండా, ఎక్కువగా పీచు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలి. తద్వారా జీర్ణ క్రియ సమస్యలు మటుమాయం అవుతాయి. గుండె, ఎముకల ఆరోగ్యం, శరీరంలోని మిగిలిన భాగాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వెనుక జీర్ణ వ్యవస్థ పనితీరు చాలా ముఖ్యం. ఆరోగ్యం మన చేతుల్లో ఉండాలంటే , జీర్ణవ్యవస్థలో ప్రధానమైన కాలేయం ను జాగ్రత్త గా కాపాడుకోవాలి. జీర్ణ వ్యవస్థలో వచ్చే మార్పుల ద్వారా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యల వల్ల గుండె మంట, కడుపు నొప్పి, అతిసారం, కడుపు ఉబ్బరం, వికారం, వాంతులు కలిగే అవకాశం ఉంటుంది. చిరు తిండ్లు, ఘాటైన ఆహారం అధిక కెఫిన్, పంచదార సేవనం, తదితర అనారోగ్యకరమైన ఆహారం వల్ల ఉదర నాళంలో సమస్యలు వస్తాయి. అధిక కొవ్వుతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల పేగుల గీతలలో మార్పులు కలిగించి ఉదర నాళంలో కణితులు ఏర్పడే అవకాశం కలుగుతుంది.ఎక్కువగా పీచు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల, ఐబిడి, హెమరాయి, మలబద్ధం కలిగిన వ్యాధులను నివారించ వీలు కలుగుతుంది. తీసుకునే ఆహారంలో సరిపడా ప్రొటీన్ ఉండేలా, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.జీర్ణ వ్యవస్థ ప్రక్రియను తగ్గించే అధిక కొవ్వు కలిగిన ఆహారాన్ని పరిమితం చేసుకోవాలి. వంటకాల్లో ఆలీవ్ ఆయిల్ను వినియోగించడం చేయాలి. ఆహారం జీర్ణం కావడానికి సమయం ప్రకారం ఆహారాన్ని తీసుకోవడం అతి ముఖ్యం. పసిరకలు, పానిక్రియాస్ సమస్యలతో పాటు మలబద్ధకం, మలంలో రక్తం రావడం, కొలన్ క్యాన్సర్ వంటి సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు తరుచూ వస్తుంటాయి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. నిరంతర ఒత్తిడి వల్ల కూడా అల్సర్ రావడానికి అవకాశాలు ఉంటాయి. మామూలుగా త్రేన్పులు వచ్చినా, అపాన వాయువులు ఎక్కువగా వచ్చినా గ్యాస్ట్రిక్ సమస్య ఏర్పడిందని అనుకోవడం, అలా ప్రపంచంలో గ్యాస్ట్రిక్ నివారణకు ఏటా రూ లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నారు. దోసకాయలు, పుచ్చకాయ, మామిడి మొదలైన పండ్లలో నీరు ఉంటుంది. ఈ పండ్లు అవయవాలను, జీర్ణ వ్యవస్థను శుభ్రపరచ డానికి సహాయ పడతాయి. ఆహారంలో వీలైనంత ఎక్కువ తాజా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు ఉండాలి. సమతుల్య భోజనం తినడానికి ప్రయత్నించాలి. రుచిగా ఉందని అతిగా తినకుండా చూసుకోవాలి. గింజలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. చిరుతిండి, కృత్రిమ మధుర పదార్థాలు, రంగులు లేదా అధిక చక్కెరను కలిగి ఉన్న అధిక ప్రాసెస్ చేసిన ఆహారాలను నివారించాలి.మానసిక ఒత్తిడి... గుండె సమస్య నుండి జీర్ణ సమస్యల వరకు అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఒత్తిడి స్థాయిల క్రమబద్ధీకణకు వ్యాయామం, ధ్యానం, యోగా, ఇష్టపడేదాన్ని చేయడం, శరీరంపై ఒత్తిడి వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను తగ్గించడంలో సహాయ పడతాయి.

